"అలా మనవి చెయ్యడానికిన్నీ సుతరామూ వీలు కనపడ్డం లేదు. నేనే బయలుదేరి వస్తాను, ఏక్షణంలో పిలుపడితే ఆక్షణంలో వచ్చి వాల్తాను. అయితే ఒక్క మనవి. ఈ పాలకీ - యీ పరివారమూ - వీటికి నే నర్హుణ్ణికాను. పాదచారినై వచ్చి నేను దొరవారిని సేవించుకుంటాను."

"మా వుత్సాహం అంతా భంగపడిపోయింది."

ఈ మాట అన్నప్పుడు ముస్సద్దీ కొనవూపిరితో వున్నట్టయి పోయాడు.

"తమ రలా సెలవిప్పించవద్దు నాదగ్గిర దొరవా రనుకుంటూ వున్న శక్తిచాతుర్యా లుండడమే నిజమయితే, యీ వ్యవధానం వారి వుత్సాహాన్ని ద్విగుణమూ త్రిగుణమూ చేసి, చివరకి ఆనందాన్ని శతసహస్రగుణాలు చేస్తుంది."

ముస్సద్దీ మరిమాట్టాడలేక, రెండుచేతులూ యెత్తి నమస్కారంచేసి, మెల్లిగా వెనక్కి తిరిగాడు.

గుమ్మందాకా వెళ్ళి శాస్త్రి సాగనంపాడు.

## 12

సుతారంగా మొగం తిప్పుకుంటూ శంకరప్ప పెద్దమ్మ కేసి చూశాడు. గభీమనివచ్చి అతని వీపు నిమురుతూ "చాలా చక్కగా చెప్పావు నాయనా! ఇలాగ మాట పొందికి వుంటే విద్య యెంతయినా రాణిస్తుంది" అని మెచ్చుకుంటూ, అతణ్ణి మంచంమీద కూచోబెట్టి పక్కని కూచుంది పెద్దమ్మ.

"ఈ వులకం యేమిటి పెద్దమ్మా?"

"వుల కాని కేం వుంది నాయనా! ఇది రసికుల లక్షణం. కళ తెలుసుకోడమూ, అనుభవించడమూ, గౌరవించడమూ - ఇంతే వారి పని. కళా పరిజ్ఞానం వున్నచోట ద్వంద్వాల చింత తలయెత్తలేదు. అదలా వుండనియ్యి నీకిదే చెప్పడం. నువ్వు వచ్చిన పని కాయో పండో తేలే దాకా పదచలనం చెయ్యవద్దు"

"సరిహద్దుకూడా కళ్ళచూడను, సరా?"

"చూస్తూవుండు. మహారాజు కూడా యిలాగే కబురు చేస్తారు, పరివారం పంపి"

"ఇదంతా నీచలవ"

ఇలా అంటూ శంకరప్ప పెద్దమ్మ పాదాలు పట్టుకున్నాడు.

అచ్చంగా అది మయూరక్రేంకారం.

మరి మాటలేదు. బలం కలిపేసిన చప్పుడు మాత్రం వచ్చింది. ఒక్క పావుగడియ వేచియుండి, తరవాత వెనక్కి వచ్చి, బల్లమీదకూచుని యాదాలాభంగా అరుగుమీద కిటికీకేసి చూశాడు శంకరప్ప.

కళ్లు చెదిరిపోయేటట్టు కిటికీలో మొదట రెండు చంద్రబింబాలు మెరిశాయి. వాటి వెనుక నూనూగు మీసాలున్నా తళుక్కుమన్నాయి.

చెరోవైపునా మొగంమీద మొగా లుంచి, శాస్త్రీ యాజులూ "కొంపలు మునిగిపోతాయనుకున్నా"మనగా, శంకరప్ప ముక్కుమీద వేలు పెట్టుకున్నాడు

వీరీ స్థితిలో వుండగా యెక్కడోలాగ మంజీరనినాదం సన్న సన్నంగా వినవచ్చింది. "ఏమిటి చెప్మా?" అనుకుంటూ వుండగా, "దణ్ణాలండి" అని వెనకాల చిలక పలుకు. ముగ్గురూ అదరిపడి వెనక్కి చూడగా, అంజలి బంధంతో వొక బంగారుబొమ్మ.

"శ్రీకృష్ణార్పణం" అని శంకరప్పా "సౌభాగ్యవతీభవ" అని శాస్త్రీ యాజులూ దీవిస్తూ లేచి నుంచున్నారు.

దరహాసలిప్తాలే అయినా శంకరప్ప చూపులతో విభ్రాంతురాలై, అంజలి బంధంతో ఆమె అలాగే నిలిచిపోయింది.

అడ్డచారల తాబొందుమీద వుప్పాడ సన్నజరీకండువా వలెవాటు. ముద్దు ముద్దుగా వాటిని పొదివి పట్టుకుని గంటల మొలనూలు. మెడలో పైటమీద యెగుడు దిగుడుగా పచ్చల పతకం. ముక్కున నత్తూ బులాకీని. చెవులకు జూకాలూ, కర్ణిపువ్వులూ, బావిలీలూనూ. చేతులకు మురుగులు, మురిడీగొలుసులు, పోచీలు, కంకణాలు, భుజబందులు. శిరస్సున సూర్యుడు, చంద్రుడు, పాపిడి పిందిరీలు, తమలపాకు, మొగిలిరేకు, తెగ బారెడు బంగారుజడ దానికి గుత్తులు గుత్తులుగా గంటలు.

ఆమె శరీరకాంతిలో కలిసి పోవడంవల్ల కొన్ని ఆభరణాల రత్నసరుకే గాని, బంగారం కనిపించడంలేదు. శిరోభూషణాలు మాత్రమే సర్వాంగీణంగా మెరుస్తున్నాయి.

సంతత పరిచయం వుండిన్నీ శాస్త్రీ యాజులూ చకితులయినారు. శంకరప్ప పరవశుడే అయిపోయాడు.

"దయ చెయ్యండి" అంది రంగనాయిక.

"ఇప్పటిదాకా కూచునే వున్నాం. దానికేంగాని, రసభంగం చేశాను, సిగ్గుగా వుంది" అన్నాడు శంకరప్ప.

"పట్నంలో కెవరో గొప్ప ఆటకాడు వచ్చారుట మీరు విన్నారు టండీ?"

వచ్చీరావడంతోటే నిలవేసినట్టు మహారాజిలా అడగ్గా మూర్తి వొక్క క్షణం గుక్క తిప్పుకోలేక వుక్కిరిబిక్కిరి అయిపోయి అంతలో మళ్ళీ సర్దు కున్నాడు.

"వినడంకాదు, చూశాను మహాప్రభూ! చూడ్డమూ కాదు, అతగాడితో ఎత్తులు కూడా వేశాను మహాప్రభూ"

"మరి సెలవిప్పించారు కారేం?"

"విధిలేక యిప్పుడు మనవి చేసుకుంటున్నాను జగత్ప్రభూ! ఆమనిషి యేలినవారి సన్నిధిలో ప్రస్తావన చెయ్యవలసినవాడు కాదండి"

"అదేమి?" అంటూ మహారాజు నిర్విణ్ణుడయాడు.

మొగంపక్కకి తిప్పుకుని "నాలుగు బాదులు బాదండి" అన్నట్టు దివాన్జీ కన్నుగీటాడు. అది గుర్తించి మూర్తి పూర్తిగా పుతెక్కాడు.

"అతగాడు కట్టుపొగరుమోతు. నాసలు వెక్కిరించడమేకాదు, నోరే బ్రాహ్మణనోరు కాదండి"

"అంటే?"

"నిజాని కొకమాత్రపు ఆటకాడే మెళుకువలు తెలిసినవాడే కాని, మాట పొందిక లేదు. వినయవిధేయత లెరగడు. పెద్దాపిన్నా తారతమ్యం లేనేలేదు. ఒకమంచి యెత్తు తోచిందంటే - లేకపోతే యెదటిబలం లొంగుబాటులో వుందంటే చప్పట్లు - కేకలు - యీలలు - ఇకిలింపులు - భరించడం కష్టం మహారాజాధిరాజా!"

"ఒకగోచిపాత కట్టుకుని, మరో గోచిపాత కప్పుకుని - అతగాడా యేమిటండీ?" అని అడిగాడు దివాన్జీ.

"చిత్రం చిత్రం, అతనేనండి తమరుకూడా"

"అతగాడే అయితే, నేనూ చూశాను మహాప్రభూ! ఒకనాడు మాయింటికి వచ్చి నానాఅల్లరీ చేశాడండి"

"శ్రీహరీ! తమ లోగిటిదగ్గిరే!" అంటూ నిర్విణ్ణత నటించాడు మూర్తి

"జవాన్లు అవతలికి పంపెయ్యబోగా, వొకడి అంగీచింపేసి, వొకడి దవాలీ లాక్కుని - ఠాణేదారుకూడా చాలా అవస్థపడ్డాడండి అతనితోటి"

మహారాజు చాలా పరితపిస్తూ "అదేమిటి చెప్మా!" అన్నాడు.

"పొగరుమోత్తనమే కాకుండా, కొంచెం మతిభ్రమ కూడా వున్నట్టు కనపడింది మహాప్రభూ"

## 17

నాటి సాయంత్రం శ్రీదాట్ల అప్పలనరసింహరాజు లోగిట్లో ఆట యేర్పాటయింది. ఎత్తువెయ్యడానికి, భీమవరపుకోట నుంచి, శ్రీవత్సవాయి విజయ రామరాజు అంచెగుర్రాల మీద వచ్చి వున్నాడు.

అప్పల నరసింహరా జెప్పుడూ చదరంగంకేసి చూడడు. దశావతారీ అంటే మాత్రం అతనికి నిద్రాహారాలక్కర్లేదు. అందులో అతను సిద్ధహస్తుడు. మహారాజుతో ఆదినారాయణం ఆడగల ముగ్గురిలోనూ అతను మొనగాడు.

సొంతానికి, అతనెప్పుడూ చదరంగం ఆడకపోయినా, చక్కని దంతపుబలం మాత్రం వొకటి సంపాదించి వుంచాడు. కోటకి వెళ్ళనిరోజున అతను ఒకవైపున దశావతారీలో కూచుని వుంటే, మరొకవైపున బంధువులో ఆశ్రితులో, మిత్రులో చదరంగం సాగిస్తూ వుంటారు.

మహారాజు దగ్గిరలాగే యేదోవొక ఆటలో సమర్థులైన వారికేగాని సామాన్యులకు అతనిదగ్గిర ప్రవేశం కలగదు.

విజయరామరాజు మహారాజుకి సన్నిహితుడు. అప్పలనరసింహరాజుకి సయానా మేనల్లుడు. పైగా అన్నగారి అల్లుడు.

భోజనానంతరం అల్లుడు మామ లిద్దరూ నిద్రపోయి లేచాటప్పటికి, పెద్దపెద్ద ఆటగాళ్ళు చాలామంది వచ్చి కనిపెట్టుకుని వున్నారు. విశాలమైన సావడి అంతా కిటకిట లాడి పోతోంది. రాజుకి సలహాలు చెప్పడానికి మొనగాళ్ళందరూ ముందువరసలో కూచుని వున్నారు.

పన్నెండేళ్ళ వయస్సుగల అప్పలనరసింహరాజు కొడుకు, వచ్చినవారి నందర్నీ చందనతాంబూలాలతో సత్కరించే, నౌకరు తెచ్చియివ్వగా దంతపు బలం చక్కగా సద్ది, యింకా వచ్చేవారికి స్వాగతం నివేదించడానికి ద్వారంలో నుంచున్నాడు.

నలుగురు మంగళ్ళు గోడల దగ్గిరగా చెదిరి నుంచుని విసనకర్రలు వేస్తున్నారు.

సావడి అంతా పునుగువత్తుల ధూమంతో గుబాళిస్తోంది. చూసి వుండిన వారు శంకరప్ప నేర్పు వుగ్గిడిస్తూ వుండగా చూడనివారు ఆప్యాయంగా ఆలకిస్తున్నారు.

ఇలాంటి సమయంలో అప్పలనరసింహరాజు వచ్చి అందరికీ నమస్కారాలు చేశాడు. సభ్యులందరూ వుబ్బెత్తుగాలేచి ఆ నమస్కారా లందుకుని ఆశీర్వచనాలు కొందరూ, ప్రతినమస్కారాలు కొందరూ చేశారు.

శాస్త్రి "నేను కొంపెల్ల జగన్నాధభట్టుగారి కుమారుణ్ణి మహాప్రభూ!" అన్నాడు.

"అలాగా? వారు దశావతారీలో నిధులు. వారి చాతుర్యం నేను చాలా మాట్లు చూశాను. తమరు—"

"వీరు చదరంగంలో నిధులు మహాప్రభూ!" అన్నాడు శంకరప్ప, మోడ్పు కేలితో నిర్దేశిస్తూ.

"అతిశయోక్తి కంటేనూ యెక్కువమాట సెలవిచ్చారు శంకరప్పగారు- నాకు జంతువుల నడకమాత్రం తెలుసు మహాప్రభూ?" అని శాస్త్రి వినయం కనపరిచాడు.

"చిత్తం, దయచెయ్యండి"

"ఇతను చిలుకూరి గోవిందశాస్త్రిగారి కుమారుడు మహాప్రభూ!" అని శాస్త్రి యాజుల్ని పరిచయంచేశాడు.

"గోవిందశాస్త్రిగారూ?" అంటూ మహారాజు అప్పలనరసింహ రాజుకేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

"వారు చాలామాట్లు తమదర్శనం చేసికుని వుండినవారు. ఒకమాటు తమ సత్కారమున్నూ గడించుకున్నారు వారు. మక్తారూపాయలు తెచ్చుకుంటూ, యెరజెర్ల వాకదగ్గిర దొంగలడ్డుకోగా లంకాదహనఘట్టం పురాణం చెప్పి వాళ్ళవల్ల బహుమతీలు పొంది—"

"ఓహో, వారా? పాతిక సంవత్సరాల నాటిమాట అది, జ్ఞాపకం వచ్చింది. పెద్దబ్బాయి నామకరణ మహోత్సవసమయంలో కాదూ వారు కోటలో పురాణం చెప్పడం?"

"చిత్తం చిత్తం. అప్పుడే తమరు వెయ్యిన్నూటపదార్లూ, దుశ్శాలువలూ, పట్టుతాపితాలూ-"

"వారి చాతుర్యంముందు అవి యేపాటివీ? వారి పురాణ ధోరణి శ్రోతలకు వీరావేశం యెత్తించేది. ప్రాస్తావికశ్లోకా లందుకున్నారంటే గవ్వల గుత్తిలాగ రాత్రీ పగలూ విరామం లేకుండా."

"ఆ విషయంలో యితనూ అంతవాడే మహాప్రభూ!"

"అలాగా? అయితే సావకాశంగా వొకమాటు-" అని అందించి అప్పలనరసింహరాజు కేసితిరిగి "సమయం కనిపెట్టి తమరు జ్ఞాపకం చెయ్యండి" అన్నాడు మహారాజు.

"చిత్తం"

